


సండే స్పెషల్ SUNDAY SPECIAL



పురాతన అభయాంజనేయస్వామి ఆలయం

ఓయ్ అంజి

- ఆ ఊరిలో ఇంటికో 'అంజయ్య'
- గ్రామంలో ఆ పేరుతో 300మంది..
- చింతకాని మండలం రామకృష్ణాపురం ప్రత్యేకత
- పక్కనున్న బస్వాపురంలోనూ 100 మంది అంజయ్యలు
- ఇష్టదైవం అభయాంజనేయ స్వామిపై విశ్వాసంతోనే...

6

ఆ గ్రామంలో ఇంటికో 'అంజయ్య' ఉంటాడు. కొత్తవారెవరైనా ఆ ఊరు వచ్చి 'అంజయ్య' అనే పేరు గల వ్యక్తి ఆచూకీ కోసం ప్రయత్నిస్తే 'ఊళ్లో ఇంటికో అంజయ్య ఉన్నాడు.. నీకు ఏ అంజయ్య కావాలి' అంటూ ఎదురు ప్రశ్నిస్తారు. ప్రత్యేకంగా ఇంటిపేరు, తండ్రి పేరు చెబితే తప్ప గుర్తించలేని పరిస్థితి నెలకొంది. చింతకాని మండలం రామకృష్ణాపురంలో అంజయ్య(అంజి) పేరు చాలా ఫేమస్.. ఈ గ్రామంలో అంజయ్య అనే పేరు గల వ్యక్తులు సుమారు 300మంది ఉంటారు. గ్రామంలో ఆ పేరు అంతమంది పెట్టుకోడానికి ఆ గ్రామం(పాటిమీద) సమీపంలో అభయాంజనేయస్వామి కొలువై ఉండటమే కారణం.. ప్రతి ఇంట్లో ఒకరికి ఆ స్వామి పేరు పెట్టుకుంటే రోజూ ఆ స్వామిని తలుచుకునే అవకాశం ఉంటుందని, అందుకే ఇంటికో అంజి ఉంటాడని గ్రామస్థులు చెబుతున్నారు.

-ఆంధ్రజ్యోతి, చింతకాని





భద్రాచలంలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి..

- మౌలిక సౌకర్యాల కల్పనలో లోపాలు ఉండకూడదు
- 15రోజుల్లో భద్రాచలం డంపింగ్‌యార్డు ప్రారంభించాలి
- రైతులకు త్రీఫేజ్ విద్యుత్‌ను తప్పనిసరిగా ఇవ్వాలి
- డయాలసిస్ రోగులకు స్థానికంగానే వైద్యం అందించాలి
- రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి
- భద్రాచలం నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం

భద్రాచలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందాలని, ఇందుకోసం అధికారులు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాచలం నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన వివిధ శాఖల అధికారులతో ఏజెన్సీ మండలాల్లోని సమస్యలపై సమీక్షించారు. అధికారులు ప్రభుత్వ ఆలోచనను ఆచరణలో పెట్టి గిరిజన కుటుంబాలకు, రైతులకు గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో బీటీ రోడ్లు, చెక్ డ్యాంలు, విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, గిరిజన రైతులకు త్రీఫేజ్ విద్యుత్తు లైన్లు, మిషన్ భగీరథ నీళ్ల సరఫరా చేసే విషయంలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని అన్నారు.

భద్రాచలంలో డంపింగ్ యార్డు నిర్మాణం పూర్తయినందున ఇందుకు సంబంధించిన మిషనరీ ఏర్పాటు చేసి 15రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ, ఇంజనీరింగు విభాగం ద్వారా చేపట్టిన రహదారులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అటవీశాఖ అనుమతులు ఏమైనా కావాల్సి ఉంటే జిల్లా కలెక్టరు, ఐటీడీఏ పీవోల ద్వారా సంబంధిత అటవీ అధికారులను సంప్రదించి పనులు చేపట్టేందుకు కావాల్సిన అనుమతులు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా త్రీఫేజ్ విద్యుత్‌ను తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. అటవీశాఖ అభ్యంతరాలతో ఆగిన త్రీఫేజ్ విద్యుత్ లైన్లకు క్లియరెన్సు తెచ్చుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. భద్రాచలం పర్ణశాల మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా జరగడం లేదని తన దృష్టికి వచ్చిందని సమస్యలు జనవరిలోపు పూర్తి చేసి ఎండాకాలంలో ఇబ్బందులు లేకుండా (మిగతా 6వ పేజీలో)

రామాలయ అభివృద్ధికి ముందుంటాం..

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- భూ సేకరణలో జాప్యంపై అధికారులపై ఆగ్రహం

7



ఐఈఎస్‌కు ఎంపికైన రాకేష్ చౌదరి

- జాతీయస్థాయిలో 71వ ర్యాంకు కైవసం
- ప్రస్తుతం ఆర్అండ్‌బీ ఏఈగా విధులు
- స్వస్థలం తుంబూరు

సత్తుపల్లి రూరల్, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) పరీక్షల్లో ఖమ్మం జిల్లాకు చెందిన మన్నేని రాకేష్‌చౌదరి జాతీయస్థాయిలో 71వ ర్యాంక్ సాధించారు. భారత ప్రభుత్వంలోని వివిధ ఇంజనీరింగ్ సేవలకు అధికారులను నియమించేందుకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఐఈఎస్ పరీక్షలు నిర్వహిస్తుంది. ఇందులో రాకేష్‌చౌదరి ఉత్తమ ప్రతిభ కనబరచడంతో కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఇంజనీరింగ్ విభాగాలలో ఉన్నత ఉద్యోగాన్ని పొందనున్నారు. రాకేష్‌చౌదరి ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తి చేశారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆర్అండ్‌బీ శాఖలో ఏఈగా పనిచేస్తున్నారు. సత్తుపల్లి మండలం తుంబూరులోని వ్యవసాయ కుటుంబానికి చెందిన మన్నేని రాంబాబు, శిరీష దంపతుల కుమారుడైన రాకేష్ జాతీయస్థాయిలో ర్యాంక్ సాధించడంపై పలువురు అభినందించారు. తన విజయాన్ని తన తల్లిదండ్రులకు అంకితమిస్తున్నట్టు రాకేష్ తెలిపారు.

పత్తి దళారులకు చెక్

45 మందిపై బైండోవర్ కేసులు

తల్లాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా గ్రామాల్లో అక్రమంగా పత్తి వ్యాపారం చేస్తున్న తల్లాడ మండలం అన్నారుగూడెం, బాలపేట గ్రామాలకు చెందిన 45మంది వ్యక్తులపై శనివారం తల్లాడ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. లైసెన్స్ లేకుండా గ్రామాల్లో అక్రమంగా పత్తి వ్యాపారం చేయడమేకాకుండా తూకంలో మోసాలకు పాల్పడుతూ చర్ల, ఎర్రుపాలెం, జూలూరుపాడు తదితర ప్రాంతాల్లో అన్నారుగూడెం, బాలపేట గ్రామాలకు చెందిన కొందరు అక్రమ వ్యాపారులు పట్టుబడిన నేపథ్యంలో సీపీ ఆదేశాల మేరకు తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు అక్రమ పత్తి వ్యాపారులపై బైండోవర్ కేసులు నమోదుచేశారు. శనివారం అన్నారుగూడెం, బాలపేట గ్రామాలకు చెందిన 45 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఏ.వనజ ఎదుట హాజరుపరిచారు.

నేడు కార్తీక వన భోజనాల జోరు

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం కార్తీక వనభోజనాల సందడి నెలకొంది. నగరంలో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్కులో కమ్మ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించనున్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని చెరుకూరి మామిడి తోటలో వనభోజనాలు నిర్వహించనున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్నూరుకాపు కార్తీక వనభోజనాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు వివిధ రాజకీయ, వ్యాపార, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. వన భోజనాల సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించనున్నారు.

వింటర్ టైమ్..



చ..చ..చలి!

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 4 డిగ్రీలు తక్కువ
- కొత్తగూడెంలో 13, ఖమ్మంలో 15.2 డిగ్రీలు
- పిల్లలు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు
- జన జీవనంపై ప్రతికూల ప్రభావం
- వ్యాధులున్న వారికి జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

6

గత వారం రోజుల ఉష్ణోగ్రతలు

వారం/తేదీ	ఖమ్మం	కొత్తగూడెం
శనివారం(23/11)	17/29	15.6/26
శుక్రవారం(22/11)	18/29	17/28
గురువారం(21/11)	17/29	18/30
బుధవారం(20/11)	18/29	18/26
మంగళవారం(19/11)	18/29	18/26
సోమవారం(18/11)	19/31	22/30
ఆదివారం(17/11)	22/31	18/29

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి పడిపోతున్నాయి. చలికాలం ప్రారంభంలో ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ, ఆ తర్వాత ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతూ వచ్చాయి. సాయంత్రం నాలుగు గంటలనుంచే చల్లని గాలులు వీస్తున్నాయి. ఏడు గంటల సమయానికే ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో బయటకు వెళ్లాలంటే ప్రజలు వణికిపోతున్నారు. ప్రతియేటా సంక్రాంతి సమయానికి పెరిగే చలి తీవ్రత ఈ యేడాది దీపావళి పూర్తయిన వారం నుంచే ప్రారంభమైంది. పగటిపూట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు తగ్గకుండా నమోదవుతుండగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు 17 నుంచి 13 డిగ్రీలు నమోదవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం/కొత్తగూడెం



నిర్మానుష్యంగా మారిన ఖమ్మం ప్రధాన రహదారి

నేడు ఇద్దరు మంత్రుల పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ఆదివారం ఇద్దరు మంత్రులు పర్యటించనున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఉదయం 9.30కి బాలపేటలో జరిగే ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. 10.30కి చెరుకూరి గార్డెన్స్ కమ్మవారి వన సమారాధనలో పాల్గొంటారు. ఆ తర్వాత వెలుగుమట్ల అర్బన్ పార్కులో అప్రోచ్‌రోడ్డుకి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత 12.30కి సత్తుపల్లిలో సెంట్రల్ పార్కులో కార్యక్రమంలో పాల్గొంటారు. సోమవారం ఉదయం 10.45కి కొత్తగూడెంలో నందాతండా వికలాంగుల కాలనీలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11 గంటలకు రైటర్ బస్తీలో లైబ్రరీ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత 11.30కి సెంట్రల్ పార్కులో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు ఖానాపురం హవేలిలో అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు.

మంత్రి పొంగులేటి పర్యటన ఇలా ...

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉదయం 10గంటలకు ఖమ్మం బల్లేపల్లిలో మలీదు జగన్ మామిడితోటలో జరిగే వనసమారాధనకు హాజరవుతారు. ఉదయం 10.30కి రఘునాథపాలెం ఆర్బీజీ మామిడితోటలో వనసమారాధనకు హాజరవుతారు. ఉదయం 11గంటలకు ఎస్సార్ గార్డెన్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొంటారు. 11.30కి చెరుకూరి వారి తోటలో కమ్మవారి వన సమారాధనకు, మధ్యాహ్నం 12గంటలకు శ్రీనివాసనగర్ ఎస్ఎన్ మూర్తి మామిడితోటలో , మధ్యాహ్నం 1.30కి మధిర తునికిపాడు రోడ్డు బాలకోటి మామిడితోటలో జరిగే వనసమారాధనలో పాల్గొంటారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయాలి

- రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 45వేల 625 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తే, తేమ శాతం, ఇతర నాణ్యత ప్రమాణాలు వచ్చిన 28వేల 847 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 18 వేల 542 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం, ట్యాబ్ ఎంట్రీలో నమోదు చేసిన ధాన్యం వివరాలకు ఉన్న వ్యత్యాసానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలకు వచ్చే ధాన్యం నాణ్యత ప్రమాణాలను పరిశీలించి తేమ శాతం రాగానే కాంటా వేసి కొనుగోలు చేయాలన్నారు. గన్ని బ్యాగుల సరఫరా చేసుకున్నప్పుడు నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. వచ్చే మూడు వారాల్లో ధాన్యం ఎక్కువ పరిమాణంలో రానుందని కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉంటూ ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్డీవో ఎస్. సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



పత్తి సాగుకు బై బై..

మక్క సాగుకు సై..

- నష్టాల నుంచి గట్టెక్కేందుకు మక్క సాగుకు మొగ్గు
- దిగుబడిపైనే రైతుల ఆశలు
- కోతుల బెడద, నీటి సమస్యే ప్రధాన అడ్డంకి

6



బడి భత్యం బకాయి

- విద్యార్థులకు సకాలంలో చెల్లించని ప్రభుత్వం
- 2021-22లో సగమే జమ
- రెండేళ్లుగా వాటి ఊసే మరిచారు..

6

ఝార్ఖండ్‌లో గెలుపు.. కాంగ్రెస్‌లో జోష్

- డీసీసీ కార్యాలయం వద్ద బాణసంచా పేల్చి సంబురాలు
- డిప్యూటీ సీఎం భట్టి వ్యూహం ఫలించిందని నేతల వ్యాఖ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం డీసీసీ కార్యాలయంలో స్వీట్లు పంచుకున్నారు. వైరా రోడ్డులో బాణాసంచా కాల్చి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఝార్ఖండ్ గెలుపు వెనుక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాజకీయ వ్యూహం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా ఏఐసీసీ భట్టి విక్రమార్కను ఝార్ఖండ్ ఇంచార్జిగా నియామకం చేయటం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మొక్క శేఖర్‌గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, బాణాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో కాంగ్రెస్ శ్రేణుల ఆనందోత్సవం



మంత్రి తుమ్మల హర్షం

ఖమ్మం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడ్‌లో ఎంపీగా ప్రియాంకగాంధీ గెలుపుపట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. వయనాడ్ ప్రజల తీర్పు అమోఘమని తెలిపారు. మొదటిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి పోటీచేసిన ప్రియాంకగాంధీని అత్యధిక మెజార్టీతో గెలిపించడం ద్వారా అక్కడి ప్రజలు నెహ్రూ, ఇందిర, రాజీవ్‌గాంధీ పట్ల విధేయతను చాటుకున్నారని తెలిపారు. ప్రియాంక గాంధీ ఎంపీగా పార్లమెంటులో రాణించాలని, దేశం ఎదుర్కొంటున్న, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషిచేస్తారని విశ్వాసాన్ని వ్యక్తంచేశారు.

పత్తిసాగుకు బై బై..
మక్కసాగుకు సై సై

- నష్టాల నుంచి గట్టెక్కే దారులన్నీ మక్కసాగు వైపుకే
- పంట దిగుబడిపైనే అన్నదాతల ఆశలు
- కోతుల బెడద, నీటి సమస్యలే ప్రధాన అవరోధాలు


మక్కసాగు చేసేందుకు పొలం సిద్ధం చేస్తున్న రైతు

బోనకల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుడమి తల్లిని నమ్ముకుని హలం చేతబూని సేద్యం చేయడం మాత్రమే వారికి తెలిసిన విద్య. రేయింబవళ్లు రెక్కలు ముక్కలయ్యేలా ఇంటిల్లిపాది కష్ట పడటంతోనే వారి జీవితాలు గడిచి పోతున్నాయి. సుఖం అంటే తెలియకపోయినా, నష్టాలు వారిని విడవకున్నా, భూమాతపైనే భారం వేసి ముందుకు సాగుతున్నారు కర్షకులు. వాణిజ్య పంటల సాగులో ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు తగ్గిన దిగుబడులు, గిట్టుబాటు ధరల లేమితో అప్పుల పాలవుతున్నారు. ఏటికేటా తాము చేసిన అప్పులు మళ్లీ సాగులో తీర తాయని భావిస్తూ పంట మార్పిడి పద్ధతిలో ముందుకు సాగుతున్నారు.

పత్తికి సాగుకు బై బై...

వానాకాలం సీజన్‌లో రైతులందరూ అత్యధికంగా పత్తి పంటను సాగు చేశారు. మండలంలో వాణిజ్య పంటలను సాగు చేసే భూములు 40వేల ఎకరాలు ఉండగా ఈ ఏడాది 28వేల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. మిగిలిన భూముల్లో మిరప, పెసర, మినప, వరి పంటలను సాగు చేశారు. అకాల వర్షాల వల్ల పత్తి పంటపై తీవ్ర ప్రభావం పడి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరానికి 4నుంచి 6 క్వింటాళ్ల వరకు ఎక్కువమంది రైతుల పొలాల్లో దిగుబడి వచ్చింది. పెట్టుబడుల భారంతో పాటు పండిన పత్తి పంటను ఇంటికి చేర్చుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. క్వింటా పత్తి తీతకు రూ.2వేల వరకు ఖర్చు వచ్చిందని వాపోయారు. తక్కువ దిగుబడులు, పెరిగిన పెట్టుబడులతో పత్తి రైతులు నష్టాలను చవి చూశారు. దీంతో పత్తిసాగుకు బై బై చెప్పి మక్కల సాగుకు శ్రీకారం చుట్టారు.

ఆశలన్నీ మక్క సాగుపైనే పెట్టుకున్నా



అల్లిక కబ్బయ్య, రైతు, ఆళ్లపాడు

ఆశలన్నీ మక్కల సాగు పైనే పెట్టుకున్నా. పత్తి పది ఎకరాల్లో సాగు చేశా. దిగుబడి తగ్గి నష్టపోయా. పత్తిని తీసేసి మక్కలను సాగు చేస్తున్నా. కౌలు ఖర్చుతోపాటు పెట్టుబడి ఎక్కువ అయింది. పత్తిసాగులో జరిగిన నష్టాన్ని మక్కల సాగులో పూడ్చుకునే ఆశతో సాగుకు దిగుతున్నాం. అన్ని అనుకున్నట్టు జరిగితే కొంతమేరకు అప్పుల నుంచి బయట పడతా.

పత్తి నిరాశ మిగిల్చింది



రైతు మరీదు నర్సింహారావు, ఆళ్లపాడు

5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశా. ఎకరానికి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కౌలుతో పాటు పెట్టుబడి మొత్తం రూ.50వేల ఖర్చు వచ్చింది. పత్తిసాగులో వచ్చిన నష్టాలను అధిగమించేందుకు మక్కల సాగు చేస్తున్నాను. మక్కల సాగు కలిసి వస్తే కొంతమేరకు అప్పుల నుంచి బయట పడతా నన్న ఆశ ఉంది.

నష్టాల నుంచి గట్టెక్కేందుకు..

పత్తిలో చవి చూసిన నష్టాల నుంచి గట్టెక్కే దారులన్నీ రైతులకు మక్క సాగు వైపునకు నడిపించాయి. పత్తి మొక్కలను తొలగించి దుక్కులు దున్నించి ముందుగానే యాసంగి సీజన్ పంటగా మక్క పంటను వేస్తున్నారు. మండలంలో దాదాపు 30 వేల ఎకరాల్లో మక్క సాగును చేస్తున్నారు. రైతులు ప్రధానంగా పంట దిగుబడి పైనే ఆశలు పెట్టుకుంటున్నారు. మక్కల సాగుకు ముందుగా పొలాన్ని సిద్ధం చేయడానికిగాను ఎకరం పొలానికి దుక్కికి రూ.2వేలు, గొర్రు తోలకానికి రూ.1600, రోటావేటర్ దుక్కికి రూ.2వేలు, అచ్చు తోలకానికి రూ.800, విత్తనాలు వేసే కూలీలకు రూ.1500, మక్క విత్తనాలకు రూ.3700, మందు కట్టలకు రూ.1700 మొత్తం కలిపి ప్రస్తుతం రూ.13,300 ఖర్చు వస్తుంది. సాగు పూర్తయ్యే వరకు మరో 12 వేల వరకు ఖర్చు వచ్చే అవకాశం ఉంది. ఎకరానికి 30 క్వింటాళ్ల మక్కలు దిగుబడి వస్తే పత్తి పంటలో వచ్చిన నష్టాలను కొంత మేరకు పూడ్చుకోవచ్చన్న ఆశాభావంలో అన్నదాతలున్నారు.


మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న కూలీలు

కోతుల బెడద, నీటి సమస్యే ప్రధాన అవరోధాలు

మక్కల సాగు రైతులకు ఆశాజనకంగా ఉన్నప్పటికీ కోతుల బెడద, నీటి సమస్యలే ప్రధాన అవరోధాలుగా కనిపిస్తున్నాయి. మక్కల సాగుకు క్రమం తప్పకుండా నీటి తడులు కావాల్సి ఉంటుంది. సాగర్‌లో పుష్కలంగా నీరు ఉండటంతో మక్క సాగుకు ఇబ్బంది లేకపోయినా, కాలువలకు ఏదైనా కారణం చేత నీటి విడుదల ఆగిపోతే మాత్రం ఇబ్బంది తప్పదు. కంకి దశలో కోతుల భారీ నుంచి పంటను కాపాడుకోవడం రైతులకు పరీక్షగా మారనుంది. ఈ సమస్యలను అధిగమిస్తే మాత్రం మక్కల సాగు ఆశాజనకంగా మారనుంది.

వైకల్యం లక్ష్య సాధనకు అడ్డుకావొద్దు

దివ్యాంగుల క్రీడా పోటీల ప్రారంభంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైకల్యం లక్ష్య సాధనలో అడ్డు కావొద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో డిసెంబరు 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాం గులు వైకల్యం తమకు ఉందని బాధపడొద్దన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో, పట్టుదలతో ముందుకు వెళ్లాలన్నారు. వైకల్యం శరీరానికే తప్ప మనస్సుకు కాదని నిరూపించాలని


భోజనం వడ్డిస్తున్న కలెక్టర్


ట్రైసైకిల్ పరుగు పోటీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

పేర్కొన్నారు. అనంతరం జెండా ఊపి దివ్యాంగుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన దివ్యాంగులను పలకరిస్తూ, వారితో కరచాలనం చేస్తూ సెల్ఫీలు దిగుతూ వారి సంతోషంలోపాలు పంచుకున్నారు. దివ్యాంగ మహిళలతో క్యారమ్స్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. దివ్యాంగులకు స్వయంగా భోజనం వడ్డిస్తూ వారితో కలెక్టర్ మమేకమవడం విశేషం. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

మోస పూరితంగా వ్యవసాయ నల్ల చట్టాలు అమలు

- ఢిల్లీ రైతుల దీక్షలు ముగిసి నాలుగేళ్లయినా రద్దుకాని మూడు చట్టాలు
- 26న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి
- టీయూసీఐ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి రామయ్య


మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రామయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నష్టపరిచి, కార్పొరేట్ శక్తులకు వ్యవసాయరంగాన్ని తాకట్టు పెట్టేందుకు రూపొందించిన మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోరుతూ ఢిల్లీలో రైతులు ఆమరణ నిరాహార దీక్షలు చేస్తే వాటిని రద్దు చేస్తామని ప్రకటించిన మోదీ ప్రభుత్వం మోసపూరితంగా పరోక్షంగా అమలు చేస్తోందని టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య విమర్శించారు. శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, అందుకే ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని.. రైతు, కార్మిక సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ములకలపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కే శ్రీనివాస్, బొమ్మకంటి రమేశ్, పేరబోయిన వెంకన్న, జలగం రాంబాబు, జోగ నాగేశ్వరరావు, అంబేద్కర్, జగదీష్, బానోత్ రవి, కే.శ్రీను పాల్గొన్నారు.


మోడల్ ప్రవేశ పరీక్షలో న్యాయవాదులు

ఐఏఎల్ ఆధ్వర్యంలో మోడల్ ఏఐబీఈ ప్రవేశపరీక్ష

ఖమ్మం లీగల్ నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఖమ్మం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఏఐబీఈ (ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్) మోడల్ ప్రవేశ పరీక్ష శనివారం ఖమ్మంలోని మానేరు లా కళాశాలలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 200మంది న్యాయవాదులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఏఎల్ సీనియర్ రాష్ట్ర నాయకులు పెమ్మసాని పట్టాభి పాల్గొని మాట్లాడుతూ న్యాయవాదులు నిత్యం తమ నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 30నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు ఐఏఎల్ రెండో రాష్ట్ర మహాసభలు హన్మకొండలో జరగనున్నాయని తెలిపారు.

మధిరలో రేపు 'ప్రజాపాలన' విజయోత్సవం

ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మధిరలో ఆదివారం జరపతలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమం సోమవారానికి వాయిదా పడినట్టు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్రప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా సోమవారం మధిరలో 'జయ జయహే ప్రజాపాలన' కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్నట్టు, ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

సమగ్ర సర్వే డేటా ఎంట్రీ

- నగరంలో 60శాతమే పూర్తయిన సర్వే
- రాష్ట్రస్థాయిలో జిల్లా వెనుకబాటు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నత్తేనయం అనే రీతిగా కొనసాగుతోంది ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో కుటుంబ ఇంటింటి సమగ్ర సర్వే. జిల్లాలోనే అత్యధిక జనాభా ఉండి అతి తక్కువస్థాయిలో సర్వే జరుగుతుండటంతో రాష్ట్రస్థాయిలో ఇంటింటి సమగ్ర సర్వేలో ఖమ్మం వెనుకంజ రికార్డులో నమోదు జరిగింది. మారుమూల మండలాలు, మునిసిపాలిటీల్లో సైతం 90శాతానికి పైగా సర్వే పూర్తి జరిగింది. ఆయా ప్రాంతాల్లో సర్వే ఆన్‌లైన్‌కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. సాంకేతిక సమస్యలను తొలగించి కొంత డేటా నమోదు చేశారు. కాని ఆన్‌లైన్ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి శనివారం లాగిన్ అవకాశం కల్పించింది. ఇదిలా ఉంటే ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో సమగ్ర సర్వే నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు 60శాతానికి చేరింది. కాగా నవంబరు 8న సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభం కాగా ఇప్పటివరకు 90వేల కుటుంబాలు వివరాలు సమగ్ర సర్వేలో సేకరించారు. సేకరించిన సమాచారాన్ని డేటా ఎంట్రీ చేసి ఆన్‌లైన్ నమోదు చేసేందుకు ఖమ్మం నగర పాలక సంస్థలో 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 180 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియామకం చేశారు. రోజుకు 600 వరకు డేటా ఎంట్రీ చేసేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు.

ఓయ్ అంజి..

చింతకాని, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం గ్రామంలో మహిమ కలిగిన పురాతన అభయాంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని కొన్ని వందల సంవత్సరాల క్రితం నిర్మించారని, ఇక్కడ మొక్కితే ఏ కోరికైనా వెంటనే తీరుతుందని గ్రామస్థుల విశ్వాసం. అందుకే గ్రామంలో ఏ ఇంట్లో చిన్న శుభకార్యం జరిగినా మొదట అంజయ్యకు మొక్కిన తరువాతే పనులు ప్రారంభిస్తారు. చుట్టుపక్కల గ్రామాల వారు కూడా మొక్కులు చెల్లించుకుంటారు. ఈ గ్రామానికి పక్కనే ఉన్న బస్వాపురం గ్రామంతో గతంలో సంబంధం ఉండటంతో అక్కడ కూడా అదే పరిస్థితి ఉంది. బస్వాపురం గ్రామంలోనూ సుమారు 100కు పైగా అంజయ్య పేరు గల వ్యక్తులు ఉన్నారు.

రెండుగా చీలిన 'పాటిమీద' గ్రామం..

ఒకప్పుడు రామకృష్ణాపురం గ్రామంతోపాటు పక్కనే ఉన్న బస్వాపురం గ్రామం ఒకటిగా ఉండేవి. రెండు గ్రామాలు రామకృష్ణాపురం సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద (పాటిమీద) ఉండేవి. వేసవిలో నీరు దొరక్కపోవడం ప్రతి సంవత్సరం గ్రామంలో ఏదో ఒక ముప్పు జరుగుతుండటంతో గ్రామంలో కొంతమంది ఉత్తరంవైపుగా వెళ్లి బస్వాపురం గ్రామం ఏర్పాటు చేసుకున్నారు. మరికొంత మంది పడమర వైపు వెళ్లి రామకృష్ణాపురం గ్రామం ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుండగా పాత బొడ్రాయి వద్ద సుమారు 100 ఏళ్ల నాటి పురాతననాణాలు బయటపడ్డట్లు గ్రామస్థులు తెలిపారు.

సీతారామ కల్యాణం...

శ్రీరామనవమి రోజున అన్ని గ్రామాల్లో సీతారామ కల్యాణం రామాలయంలో నిర్వహిస్తారు. కానీ రామకృష్ణాపురంలో మాత్రం రామాలయంలోని సీతారాముల ఉత్సవ విగ్రహాలను అభయాంజేయస్వామి ఆలయం ఆవరణకు తీసుకొచ్చి అక్కడే సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహిస్తారు. కిలోమీటరు దూరంలో ఉన్న ఆలయానికి గ్రామస్థులంతా మేళతాళాలతో వచ్చి వేడుకలో పాల్గొంటారు.



అంజయ్యను రోజూ తలవాలనే ఉద్దేశంతోనే.. కన్నెబోయిన అంజయ్య

ఎన్నో ఏళ్ల క్రితం పాటిమీద ఉన్న గ్రామం కొన్ని ఇబ్బందుల కారణంగా కిలోమీటరు దూరం వచ్చి రామకృష్ణాపురం గ్రామంగా ఏర్పడిందని, నా చిన్నతనంలో మా తాతయ్య చెప్పేవాడు. నాకిప్పుడు 80ఏళ్లు.. మా చిన్నతనంలో అందరి పేర్లు అంజయ్యగా ఉండటంతో నా స్నేహితులను ముద్దు పేర్లు పెట్టి పిలిచుకునే వాళ్లం. మా గ్రామ దైవం అభయాంజేయస్వామిని నిత్యం తలుచుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఆయన పేరును ఇంటికొకరు పెట్టుకుంటున్నారు. అంజయ్య పేరు కాస్త మోటుగా ఉండటంతో ఇప్పటి తరంవారు ఆ పేరును సవరించి అంజిగా పిలుచుకుంటున్నారు.


రామకృష్ణాపురం గ్రామం

చ..చ..చ..చలి!

ఖమ్మం/కొత్తగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాధారణంగా 20.4 డిగ్రీలు నమోదు కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 15.6 డిగ్రీలు సగటు ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం జిల్లాలో సాధారణంగా 20.6 డిగ్రీలు నమోదు కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 17 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం రోజు గడిచిన 24 గంటల్లో కొత్తగూడెం జిల్లాలోని గుండాలలో 13డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది ఇదే సమయానికి గుండాలలో 21.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం జిల్లాలోని కామేపల్లి మండలం లింగాలలో 15.2 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా గతేడాది ఇదే సమయానికి అక్కడ 21.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలి తీవ్రత పెరగడంతో సాయంత్రం ఏడు గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల లోపు ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. చలి పెరిగిన కారణంగా జిల్లాలో స్వెట్టర్లకు గిరాకీ పెరిగింది.

ఏజెన్సీ ప్రాంతాల్లో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అడవులు అధికంగా ఉండటం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో మంచుకురుస్తోంది. సాయంత్రం 6గంటలకే చలి వణికిస్తోంది. రాత్రి గడిచే కొద్ది మరింత పెరుగుతోంది. తెల్లవారుజాము నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మంచు విపరీతంగా కురిసి చలి ప్రభావం పెరుగుతోంది. వేసవికాలంలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఈ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి చలి ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లాలో గత రెండు రోజుల నుంచి 25 డిగ్రీల నుంచి 27డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. ఒక్కసారిగా అత్యల్పంగా ఉష్ణోగ్రత 15 నుంచి 18 డిగ్రీలలోపులో ఉంటోంది. మరోవైపు మంచు కురవడంతో చలి తీవ్రత వల్ల వ్యవసాయదారులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రగ్గులు, స్వెట్టర్లు కప్పుకుని వెళ్తున్నారు. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలైన భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, పినపాక, కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, పాల్వంచ, జూలూరుపాడు, సుజాతనగర్, చంద్రుగొండ, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి తదితర మండలాల్లో అత్యధికంగా చలి ప్రభావం పెరిగిపోతోంది. రెండు రోజుల నుంచి చలి విపరీతంగా పెరిగిపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

చలికి వెళ్లే వారికి వ్యాధులుంటే దానికి తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులుండేవారు చలికాలంలో జాగ్రతలు పాటించాల్సిందేననీ, వీలైనంత వరకు చలిలో తిరగకుండా ఉండటం మంచిదంటున్నారు. చలితో గుండెపోటు, ఛాతీ నొప్పులు వచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నారు. హృద్రోగంతో బాధపడే వారు సమయానికి మందులు వేసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. చలికి సైనస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన చలి నుంచి ముఖాన్ని రక్షించుకోవాలంటే క్రీమ్‌లీస్ మాయిశ్చరైజర్లు రాసుకోవాలి.

చలికి ముఖం పొడిబారి మంటగా ఉంటుంది. వీటిని రాయడం వల్ల ఉపశమనంతో పాటు చల్లగా ఉంటుంది. గ్లిజరిన్, కొబ్బరినూనె వంటివి స్నానం చేసిన వెంటనే రాసుకోవాలి. చలిలో బయటకు వెళ్లేటప్పుడు రక్షణ దుస్తులు ధరించడం మంచిదని సూచిస్తున్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి..

(5వ పేజీ తరువాయి)

చూడాలని అన్నారు. నీటిపారుదల శాఖ ద్వారా గిరిజన రైతుల పంట పొలాలకు తప్పనిసరిగా నీరు అందించాలని కెనాల్, చెక్ డ్యాంల మరమ్మతులుంటే అవి వెంటనే పూర్తి చేయాలన్నారు. డయాలసిస్ రోగులకు ప్రత్యేకంగా భద్రాచలంలోనే వైద్యం అందించాలని చర్లలో డయాలసిస్ సెంటర్ వెంటనే ప్రారంభించి వైద్యసేవలందించాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బంది కలగకుండా వ్యవసాయశాఖ వారికి ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.

ఈ సందర్భంగా మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకటరావు మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని వెంటనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సహాయం కోసం వచ్చే గిరిజనులకు సరైన వసతులు లేవని ముఖ్యంగా బెడ్లు లేక ఇబ్బందిగా ఉందన్నారు. చర్ల, వెంకటాపురం, దుమ్ముగూడెం గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం డిగ్రీ కళాశాల నెలకొల్పాలన్నారు. భద్రాచలం కరకట్ట నిర్మాణం చేపట్టి 40శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గ పరిధిలో పెండింగులో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాంకేతికపరంగా ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు.

ఎస్‌వోపై ఆగ్రహం... సమీక్ష సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ ఎస్‌వో సురేష్‌బాబుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహించారు. ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాల సమగ్ర సమాచారం లేకుండా సమావేశానికి ఎందుకు వచ్చారని, వెంటనే వెళ్లిపోండి అని ఆదేశించారు. అయితే సురేష్ బాబు అక్కడే కూర్చోగా మళ్లీ మంత్రి కలుగజేసుకొని బయటకు వెళ్లాలని సూచించడంతో ఆయన వెళ్లిపోయినట్టు సమాచారం.

బడి భత్యం బకాయి

- విద్యార్థులకు సకాలంలో చెల్లించని ప్రభుత్వం
- 2021-22లో సగమే ఖాతాల్లో జమ
- రెండేళ్లుగా వాటి ఊసే మరిచారు

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ప్రకారం ఆవాస ప్రాంతానికి కిలో మీటరు లోపు ప్రాథమిక పాఠశాల ఉండాలి. మూడు కిలో మీటర్ల లోపు ప్రాథమికోన్నత పాఠశాల, 5 కిలోమీటర్ల లోపు ఉన్నత పాఠశాల ఉండాలి. ఆయా పాఠశాలల్లో చదువుకోవడానికి ఆవాస ప్రాంతం నుంచి రవాణా సదుపాయం ఉండాలి. ఖమ్మం జిల్లా పరిధిలో ఆవాస ప్రాంతాల నుంచి బడి బాట పట్టేందుకు నిర్దేశించిన పరిధిలో పాఠశాలలు లేక దూరంగా ఉండి చదువుకునేందుకు వెళ్తున్న విద్యార్థులకు బస్సు, రవాణా సదుపాయం లేని వారికి రవాణా నెలకు రూ.250 భత్యం చెల్లించాల్సి ఉంది.

గత ఏడాది భత్యం ఏదీ..

2022-23 సంవత్సరానికి సంబంధించి 767 మంది విద్యార్థులకుగాను రూ. 25 లక్షల, 15 వేల, ఏడు వందలు, 2023-24 విద్యా సంవత్సరానికి 758 మంది విద్యార్థులకు రూ. 24 లక్షల 17 వేలు భత్యం చెల్లించాల్సి ఉండగా ఏడాది పూర్తి కావస్తున్నా నేటికీ అందలేదు. 2021-22కు సంబంధించి రూ.20లక్షల 92 వేలు చెల్లించాల్సి ఉండగా వాటిలో సగం మాత్రమే చెల్లింపులు జరిగాయి. విద్యా సంవత్సరం ముగిసినా ఇంకా పూర్తిస్థాయిలో చెల్లించలేదు. కాగా 2023-24 విద్యా సంవత్సరానికి జిల్లా పరిధిలో రవాణా భత్యం 758 మంది విద్యార్థులకు చెల్లించేందుకు ప్రాథమికంగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఖమ్మం జిల్లాలో రవాణా భత్యం కోసం విద్యా సంవత్సరం 2022-23లో 767 మందికి, 2023-24లో 758 మందికి రవాణా భత్యం చెల్లిచాల్సి ఉంది. వచ్చే విద్యా సంవత్సరం జిల్లాలోని 1265 పాఠశాలల్లో భత్యం కోసం నివేదికలు పంపారు. రవాణా భత్యానికి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నెలకు రూ.400, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు నెలకు రూ.600 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ రవాణా భత్యం పది నెలల పాటు ఇస్తారు. సమగ్ర శిక్షా కింద విద్యా శాఖ అధికారులు నివేదిక పంపించారు. వాటిలో పూర్తిస్థాయిలో పరిశీలించి వచ్చే విద్యా సంవత్సరానికి అర్హుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఆయా విద్యార్థులకు బ్యాంకు ఖాతాలో పడేలా చూస్తారు.



దివ్యాంగులు, బాలికలకు ప్రత్యేకం..
రాజశేఖర్, విద్యాశాఖ కార్యాలయ సీఎంవో

జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు రవాణా భత్యం, ఎస్కార్ట్ భత్యం, గర్ల్స్ స్టయిఫండ్, రీడర్ ఎలవెన్సు ఇస్తున్నారు. గత ఏడాది ఎస్కార్ట్ రవాణా భత్రాలు నెలకు రూ. 350 ఉండగా ఈ సంవత్సరం రవాణా భత్యం నెలకు రూ. 500,ఎస్కార్ట్ భత్యం నెలకు రూ550కు పెంచారు. బాలికలకు స్టయిఫండ్‌గా నెలకు రూ.200 ఇస్తున్నారు. దివ్యాంగ విద్యార్థులకు సదరం సర్టిఫికెట్లు ఉన్నవారికి ప్రభుత్వం నెలకు రూ. 3000 పించన్ కూడా ఇస్తోంది. ఉచితంగా ఆర్టీసీ బస్సు పాసులు కూడా ఇప్పిస్తున్నాం. ఈ పాసులతో టికెట్ ధరలో సగం మాత్రమే చెల్లించి ప్రయాణం చేయవచ్చు.

బీజేపీ విజయం పట్ల తాండ్ర హర్షం

ఖమ్మం బైపాస్‌రోడ్ నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ , అమిత్ షా, నడ్డా నేతృత్వంలో బీజేపీ పట్ల ప్రజలకున్న అమితమైన విశ్వాసానికి ఈఎన్నికల ఫలితాలు దర్పణం పడతాయన్నారు. ఇది దేశంలో బీజేపీ ప్రభంజనానికి మోదీ అద్భుత పాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో సువర్ణ అవకాశం చేజార్చుకున్న ఖమ్మం ఓటర్లు జరిగిన తప్పునకు చింతిస్తున్నారన్నారు. తెలంగాణలో కూడా కమల వికాసానికి మహారాష్ట్ర ప్రజల తీర్పు రూఢీ చేస్తుందన్నారు. మహారాష్ట్రలో ప్రచారం చేసి విజయానికి దోహదం పడిన తెలంగాణ బీజేపీ నేతలు, మంత్రులకు అభినందనలు తెలిపారు.

కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓ మృతదేహానికి కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా 14వ నెంబరు బస్తీకి చెందిన రామ్‌కుమార్(38) తీవ్ర అనారోగ్యంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులకు స్తోమత లేకపోవటంతో నగరంలోని అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించి అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో అన్నం శ్రీనివాసరావు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నగరంలోని బల్లెపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



- నిరుపయోగంగా తరుణి హట్
- సంవత్సరాల తరబడి ఉపయోగంలోలేని భవనాలు
- శిథిలావస్థకు చేరిన ప్రాంగణం
- గతంలో సమీకృత మండల కార్యాలయ సముదాయం ఏర్పాటుకు ప్రయత్నం
- పట్టించుకోని అధికారులు

రూ. కోట్లు వెచ్చించారు... నిర్లక్ష్యంగా వదిలేశారు..

ఖమ్మం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో 2002లో ఖమ్మం రూరల్ మండలం, వరంగల్ క్రాస్ రోడ్డులో మహిళ సంఘాల కోసం నిర్మించిన తరుణి హట్ నిరుపయోగంగా మారింది. ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులకు వివిధ రకాల వృత్తులపై శిక్షణ ఇచ్చే వారు తయారు చేసిన వస్తువులను విక్రయించుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రాంగణమే తరుణి హట్. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు నాటి టీడీపీ ప్రభుత్వంలో వరంగల్ క్రాస్ రోడ్డులోని సుమారు 6 ఎకరాల ప్రభుత్వ భూమిని తరుణిహట్‌కు కేటాయించారు. రాష్ట్ర ఆర్థిక మహిళా కార్పొరేషన్ నుంచి రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేసి తరుణిహట్ ప్రాంగణాన్ని నిర్మించారు.

2004లో తరుణి హట్ ప్రారంభం

2002వ సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేయగా, 2004లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న రేణుకా చౌదరి తరుణి హట్‌ను ప్రారంభించారు. నాటి నుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలు అక్కడ స్తంభాద్రి ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం కొంతకాలం సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉపయోగించుకున్నారు. కొంత భాగంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి యువకులకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రైసెట్ పేరుతో వివిధ రకాల వృత్తులపై శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు.

తరుణి హట్ ప్రాంగణంలోకి రూరల్ మండలానికి సంబంధించిన ప్రభుత్వ శాఖల కార్యాలయాలు అన్నీ ఒకే చోటుకు తీసుకురావాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. నూతనంగా ఏర్పాటు కానున్న ఏదులాపురం మునిసిపాలిటీ కార్యాలయ భవనంగా తరుణిహట్‌ను వినియోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం

కోట్లు ఖర్చు చేసినా నిరుపయోగమే..


మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు రూ.కోట్ల నిధులు కేటాయించి నిర్మించిన తరుణి హట్ లక్ష్యం నెరవేరకపోగా నిరుపయోగంగా మారింది. తరుణి హట్ ప్రాంగణం పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, పెద్ద పెద్ద చెట్లతో అడవిని తలపిస్తోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి తరుణి హట్ ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకురావలని మండల ప్రజలు కోరుతున్నారు.



2002నాటి శంకుస్థాపన శిలాఫలకం

రిటైరైన సింగరేణి కార్మికులకు రూ. 18.27కోట్ల దీపావళి బోనస్

- 27న కార్మికుల ఖాతాల్లో జమకానున్న బోనస్
- సీఎండీ ఎన్. బలరాం వెల్లడి



కొత్తగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో, 2024 ఏప్రిల్ 1 నుంచి 2024 అక్టోబరు 24 మధ్యలో పని చేసి రిటైరైన కార్మికులకు సంబంధించిన పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీం (దీపావళి బోనస్) సొమ్మును విడుదల చేస్తున్నామని, ఈ నెల 27వ తేదీన వారి ఖాతాల్లో బోనస్ సొమ్ము జమ అవుతుందని సింగరేణి సీఎండి ఎన్. బలరాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైరైన 2,754మంది కార్మికులకు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.93,750లు చొప్పున మొత్తం రూ. 18.27కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న రిటైరైన కార్మికుల ఖాతాల్లో జమ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్థిక, సిబ్బంది వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

కిరాణాషాప్ యజమాని దివాలా పిటీషన్



ఖమ్మం లీగల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం మత్కేపల్లి గ్రామానికి చెందిన కిరాణాషాప్ యజమాని కటికోల రామకృష్ణ ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం రూ. 40.77 లక్షలకు దివాలా పిటీషన్ దాఖలు చేశారు. పూర్తి వివరాల ప్రకారం.. రామకృష్ణ గత 12 సంవత్సరాలుగా మత్కేపల్లి గ్రామంలో కిరాణాషాపుతో పాటు పత్తి, మిర్చి వ్యాపారం చేసేవాడు. వ్యాపార అభివృద్ధికోసం 21 మంది స్నేహితులు, బంధువుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకున్నాడు. అదేవిధంగా ఇతను కూడా కొంతమందికి రుణాలు ఇచ్చాడు. దివాలాదారుడు ఇచ్చిన రుణాలు తిరిగిరాకపోవటంతో వ్యాపారంలో నష్టం రావటంతో రుణ దాతల ఒత్తిడి పెరగడంతో శనివారం 21 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ తమ న్యాయవాదులు ముప్పా నాగేశ్వర రావు, తెల్లాకుల రమేష్ బాబు ద్వారా దివాలా పిటిషన్ దాఖలుచేశారు.

క్రైం సమాచారం

పాము కాటుతో వ్యక్తి మృతి



మధిర రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం మధిర మండలం దెందుకూరు గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో గుర్రం వెంకటేశ్వర్లు కుమారుడైన గుర్రం కిరణ్(41) కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓ రైతు పొలంలో మొక్కజొన్నకు నీళ్లు పెట్టేందుకు కూలీపనులకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పొలానికి నీళ్లు పెడుతుండగా పక్క పొలంలో కూలీలు కలుపు తీస్తున్నారు. ఈ సమయంలో పాము కన్పించటంతో కూలీలు ఒక్కసారిగా కేకలు వేయడంతో పక్కనే నీళ్లు పెడుతున్న కిరణ్ అక్కడకు వెళ్లి కర్రతో పామును కొట్టే క్రమంలో కిరణ్‌ను కాటేసింది. అయినా పామును చంపేశాడు. పాముకాటుకు గురికావడంతో పొలం వద్దనుంచి మధిరలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇతడి మృతితో కుటుంబంలోనూ, గ్రామంలోనూ విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాటిచెట్టు పైనుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆళ్లపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) తాటిచెట్టుపై నుండి ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆళ్లపల్లి మండలంలో శనివారం జరిగింది. ఆళ్లపల్లి మండలం, మర్కోడు (డబుల్ బెడ్‌రూం) కి చెందిన కొమరం కాంతారావు శనివారం పక్క గ్రామమైన కర్నెగూడెంలో తాటిచెట్టు ఎక్కి కమ్మలు కరుకుతుండగా అక్కడ నుండి ప్రమాదవ శాత్తు కింద పడ్డాడు. దాంతో కాంతారావుకి ఎడమ కాలు విరిగింది, తలకు గాయాలు అవ్వడంతో ఆళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు.

మామపై అల్లుడి దాడి

తల్లాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో మామపై అల్లుడు దాడికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. అన్నారుగూడెం గ్రామానికి చెందిన పెద్దిన్ని రాము కుమార్తె దీప్తిని అదే గ్రామానికి చెందిన గోనా కిరణ్ ప్రేమవివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి మామ రాము, అల్లుడు కిరణ్‌ల మధ్య వైరుధ్యం నెలకొంది. దీంతో మామ రామును అల్లుడు కిరణ్ స్క్రూడ్రైవ్‌తో పొడిచి తీవ్రంగా గాయపర్చాడు. తనపై జరిగిన దాడి గురించి రాము తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్‌ఐ బి.కొండల్‌రావు కేసు నమోదుచేసి తీవ్రంగా గాయపడిన రామును చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.



మాట్లాడుతున్న సంఘం ప్రధానకార్యదర్శి బొంతు రాంబాబు

చెరుకు సాగుపై పాలకుల నిర్లక్ష్యం

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు

నేలకొండపల్లి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): చెరుకు సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మూటాపురం గ్రామంలోని బీకేఆర్ గార్డెన్స్‌లో శనివారం జరిగిన చెరుకు రైతుల రాష్ట్ర సదస్సులో రాంబాబు పాల్గొన్నారు. రచ్చా నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో రాంబాబు మాట్లాడుతూ చెరుకు రైతుల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నాయని, ఫలితంగా రైతులు చెరుకు సాగు పట్ల ఆసక్తి కనపర్చటం లేదన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

సదస్సులో రాష్ట్ర నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వనపర్తి జిల్లాకు చెందిన జీఎస్ గోపి, కార్యదర్శిగా ఖమ్మం జిల్లాకు చెందిన రాంబాబులతో పాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, భూక్యా కృష్ణ, బిక్కసాని గంగాధర్, యలమద్ది వెంకటేశ్వరరావు, బలుసు హనుమంతరావు, వాసిరెడ్డి ప్రసాద్, కట్టెకోల వెంకన్న, మల్లెల సన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.

అర్హులందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు



మద్దులపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఖమ్మం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి, మద్దులపల్లి, గుర్రాలపాడు, వరంగల్ క్రాస్ రోడ్డు గ్రామాల్లో శనివారం సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. కుటుంబ స్మార్ట్ కార్డు ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమపథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అతికొద్ది రోజుల్లోనే అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతుందని తెలియచేశారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలోని సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డు అందిస్తామని దీని ద్వారానే పేదలకు రేషన్, అర్హులకు వృద్ధాప్య పెన్షన్, ఆరోగ్య శ్రీ, గృహజ్యోతి తదితర పథకాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ హరినాదబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, నాయకులు బండి జగదీష్, మద్ది మల్లారెడ్డి, నవీన్, సుబ్బారావు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిడ్డంగులను సద్వినియోగం చేసుకోండి

- లక్ష టన్నుల సామర్థ్యం గల గోదాంల ఏర్పాటుకు కృషి
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



వేర్‌హౌజ్ గిడ్డంగి కార్మికులతో మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

లక్ష్మీదేవిపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయదారులు తాము పండించిన పంటను వేర్‌హౌజ్ గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం లక్ష్మీదేవిపల్లిలోని వేర్‌హౌజ్ గోడౌన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయదారులు ధాన్యాన్ని ఏఎంసీ, ఇన్వెస్టర్ గోడౌన్లలో నిల్వ చేస్తున్నారని అలా కాకుండా మొదటి ప్రాధాన్యంగా వేర్‌హౌజ్‌గోడౌన్లలో నిల్వ చేసుకోవాలని సూచించారు. అలా కాకుండా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 నియోజకవర్గాల్లో వేర్‌హౌజ్ కార్పొరేషన్ ద్వారా గిడ్డంగుల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువగా పండటం చేత నిల్వ చేసుకునేందుకు సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అటువంటి సమస్యలు తలెత్తకుండా లక్షటన్నులు నిల్వ చేసుకునేలా నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముగ్గురు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వారు కావడం సంస్థ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తద్వారా గిడ్డంగుల నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గిడ్డంగి కార్మికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వారి భద్రత, జీతభత్యాలు తదితర అంశాలపై బాధ్యతాయుతంగా సంస్థ కృషి చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగుల్లో ధాన్యాన్ని మాత్రమే నిల్వ చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో మిర్చి ఎక్కువ పండే ప్రాంతాల్లో కోల్డ్‌స్టోరేజీల నిర్మాణాలకు కూడా ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఈ గిడ్డంగుల్లో తాము పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలని తద్వార బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పిస్తామని, దళారుల బెడద తప్పుతుందని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, బిక్కసాని నాగేశ్వర రావు, పరుచూరి గోపాలకృష్ణ, శ్రీనగర్‌కాలనీ మాజీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్ చంద్, ఎఫ్‌సీఐ గోడౌన్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధికి ముందుంటాం..

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- భూ సేకరణలో జాప్యంపై అధికారులపై ఆగ్రహం



కుసుమ హరినాథ బాబా ఆలయం వైపు చేపట్టనున్న విస్తరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి

భద్రాచలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామాలయ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉందని, అభివృద్ధి కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులం ముందుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని శనివారం దర్శించుకున్న అనంతరం ఆయన కొద్దిసేపు విలేకర్లతో మాట్లాడారు. భద్రాద్రి రామాలయ అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.68 కోట్లు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సుమారు రెండు ఎకరాలకు పైగా స్థలం కావాల్సి ఉందని ఇందుకోసం భూ సేకరణ పనులు సైతం చేపడుతున్నామన్నారు.

అనంతరం అధికారులతో కలిసి రామాలయం పరిసరాల్లో చేపట్టనున్న విస్తరణ పనులను పరిశీలించారు. అంతకు ముందు రామయ్య దర్శనానికి వచ్చిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణలకు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. కాగా పట్టణంలోని డబుల్‌బెడ్‌రూంలను మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. చివరగా గృహ నిర్మాణ శాఖ అతిథి గృహంలో గిరిజన మహిళలు తయారు చేసిన ఆదివాసీ వంటకాలతో భోజనం చేశారు.

భూ సేకరణ పనుల్లో జాప్యంపై ఆగ్రహం

రామాలయ భూ సేకరణ పనులపై జాప్యం ఎందుకని భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు దేవస్థానం ఈఈ వి. రవీంద్రనాథ్‌లపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి దేవస్థానం ఈవో క్యాంపు కార్యాలయంలో అధికారులతో కొద్దిసేపు జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నెలలు గడుస్తున్నా భూసేకరణ పనులు ఇంకెప్పటికి పూర్తి చేస్తారని ఆయన ప్రశ్నించారు. పనులు చేయడం చేతగాకపోతే సెలవుపై వెళ్లాలని సూచించారు. భూ సేకరణ పనులను సత్వరమే చేపట్టాలని మంత్రి ఆదేశించారు. కాగా రామాలయ విస్తరణ పనుల్లో భాగంగా కుసుమహరినాథబాబా ఆలయం వైపు ప్రాంతాన్ని మంత్రి పొంగులేటి అధికారులు కలిసి పరిశీలించారు. ఈ సమయంలో ఆలయం యథాప్రకారం ఉంటుందని ఇళ్లను మాత్రం తొలగించాల్సి ఉంటుందని తెలిపారు.



పునఃనిర్మిస్తున్న రైతుబజార్‌లో దుకాణాలు కేటాయించాలి

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ వద్ద పునఃనిర్మిస్తున్న పాత రైతుబజార్‌లో తమకు దుకాణాలు కేటాయించాలని శనివారం నూతన స్టాండ్ వద్ద గల సమీకృత మార్కెట్ దుకాణదారులు జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి అలీంకు వినతి పత్రం అందించారు. సమీకృత రైతుబజార్ ప్రారంభమైన దగ్గర్నుంచి దుకాణాలు పెట్టామని, ఇక్కడ వ్యాపారం సరిగ్గా జరగక తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. తమకు పాత రైతు బజార్‌లో వ్యాపారం చేసుకునేందుకు చోటు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో దుకాణదారులు వెంకటరెడ్డి, యాదగిరి, సందీప్, నాగరాజు, సురేష్, సైదులు, వెంకన్న, విజయ, రైతుబజార్ ఎస్టేట్ అధికారి పద్మ ఉన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	44 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	50
బీరకాయ	48
పచ్చిమిర్చి	30
కాకరకాయ	34
బెండకాయ	28
పొట్లకాయ	38
దోసకాయ	28-48
చిక్కుడు	68
నాటుచిక్కుడు	84
గోరుచిక్కుడు	34
క్యాబేజీ	34
దొండ	34-40
సొరకాయ	28
క్యారెట్	64
క్యాప్సికం	54
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కంగువ
తిరుమల:	దేవకీనందన వాసుదేవ
సినీ గెలాక్సీ:	జీబ్రా

1న భలే మంచి రోజు

ఖమ్మంసాంస్కృతికం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల1న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో భలే మంచిరోజు సంగీతవిభావరి జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు టి.వాసుదేవ్, యస్.సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర గాయకుడు ఘంటాల అభిమానులను అలరించే విధంగా భలేమంచి రోజు కార్యక్రమాన్ని 28 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దాశరధి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాల్లో భాగంగా దాశరథిపై చేసిన పరిశోధన గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఘంటసాల గీతాలను అద్భుతంగా ఆలపించే బీఏ నారాయణ, తదితర గాయనీ గాయకులు ఘంటసాల పాటలను పాడి వినిపిస్తారని తెలిపారు.

నేడు కమ్మవారి వనభోజనాలు

నేలకొండపల్లి,నవంబరు23(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడి తోటలో ఆదివారం కమ్మవారి వనభోజనాలను నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. కమ్మ బంధువులంతా హాజరు కావాలని కోరారు. కాపు, పద్మశాలీల వనసమారాధనలు ఆదివారం నిర్వహిస్తున్నారు.

మీకు తెలుసా?

మొట్టమొదటి రింగ్ రోడ్డు జెడ్పీసెంటర్



ఖమ్మంసాంస్కృతికం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ప్రధాన వీధుల్లో జెడ్పీసెంటర్ ఒకటి. ఇది నగరంలో ఏర్పాటైన అంతర్గత రింగ్ రోడ్లలో మొదటి కావటం విశేషం. ఇది మూడు రోడ్ల కూడలి కావటంతో ఇక్కడ రింగ్ ఏర్పాటు చేసి వాహనాల రాక పోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. పాతకలెక్టరేట్, జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి, జెడ్పీసెంటర్, ఆర్‌అండ్‌బీ తదితర ముఖ్య కార్యాలయాలు ఉండటంతో ఈప్రాంతానికి మొదటి నుంచి అత్యంత ప్రత్యేకత కలిగి ఉంది.సమస్యలపరిష్కారాలను డిమాండ్ చేస్తూ వామపక్ష, తదితర పార్టీలు, అనుబంధసంఘాల ఆందోళనలకు ఇదే కేరాఫ్ అడ్రస్‌గా కూడా వెలుగొందింది. ఈ ప్రాంతంలో ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయం కారణంగా జెడ్పీసెంటర్ అనే పేరొచ్చింది. బైపాస్ రోడ్ ఏర్పాటు కాక ముందు ఈరోడ్డునుంచే బస్సులు లారీలు సైతం ప్రయాణించేవి. జెడ్పీ సెంటర్‌గా దశాబ్దాల పాటు పేరు కొనసాగినప్పటికీ ఇక్కడ ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం కారణంగా ప్రాంతానికి అంబేద్కర్ సెంటర్ అన్న పేరుకూడా స్థిరపడింది. ఐనప్పటికీ చాలామంది జెడ్పీసెంటర్‌గానే పరిగణిస్తుంటారు.

హాస్టల్స్ స్టోర్ రూముల సౌకర్యాలపై ప్రతిపాదనలు పంపాలి

» అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లల్లో స్టోర్‌రూమ్‌లలో చేయాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంక్షేమ హాస్టల్లో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కేజీబీవీలలో సరుకులు స్టోర్ చేసేందుకు అవసరమైన ర్యాక్, సామగ్రి ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేజీబీవీల దగ్గర అందుబాటులో ఉన్న నిధులతో ఈ వసతులు కల్పించాలని, డిసెంబరు25 నాటికి పనులు పూర్తి చేసి ఫోటోలు అందించాలన్నారు. రెసిడెన్షియల్ హాస్టల్స్ కేజీబీవీలలో ఫిల్టర్ తాగునీటి కోసం మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సెడిమెంట్ ఫిల్టర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. డిసెంబర్ నెలలో హాస్టల్స్, కేజీబీవీలలో స్టోర్ రూమ్, ఫిల్టర్ల సౌకర్యం ఏర్పాటు కావాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కె.సత్యనారాయణ, జి. జ్యోతి, ఎన్. విజయలక్ష్మి, సోమశేఖరశర్మ, అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దరావత్ చంద్రుకు సీపీఐ నేతల నివాళి

ఖమ్మంరూరల్,నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నడిమితండాకు చెందిన ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు, ఎక్సైజ్ కానిస్టేబుల్ దరావత్ చంద్రకు సీపీఐ నాయకులు నివాళులర్పించారు. చంద్రు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, జితేందర్ రెడ్డి, జానిమియా, తదితరులు చంద్రు చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు.

జోరుగా మట్టి అక్రమ వ్యాపారం

» ఇంటిగ్రేటెడ్ గురుకులంలో చదును చేయకుండా అమ్మకాలు
» ప్రశ్నించే కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు


మట్టి తరలిస్తున్న లారీ

రఘునాథపాలెం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): అక్రమ మట్టి వ్యాపారానికి అలవాటు పడిన వ్యాపారులు ఏ మాత్రం చిన్న అవకాశం వచ్చినా.. దందా కొనసాగిస్తూనే ఉన్నారు. రఘునాథపాలెం మండలం జింకల తండా వద్ద ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ఇంటిగ్రేటెడ్ సంక్షేమ వసతిగృహం నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. అక్కడ ఉన్న గుట్టను సదును చేసి ఇంటిగ్రేటెడ్ సంక్షేమ వసతి గృహం నిర్మాణానికి ఓసంస్థకు అనుమతి తీసుకొంది. అయితే గుట్ట నుంచి తవ్వని మట్టిని ఆదే ప్రాంతంలో సదును చేయకుండా బయట వాహనాలకు అమ్మకాలు జరుపుతున్నారు. బయట వాహనాలకు లోడింగ్ చేసినందుకు చిన్న లారీకి రూ.1వెయ్యి, పెద్దలారీలకు రూ2 వేలు వసూళ్లు చేస్తున్నారు.మట్టి లోడింగ్ చేసుకున్న లారీలు ఖమ్మంలో ఒక్కో లారీ రూ.10వేలకు అమ్మకాలు జరుపుతున్నారు.

ప్రశ్నించే కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు

రఘునాథపాలెంలో అక్రమ మట్టి వ్యాపారాన్ని ప్రశ్నించే కాంగ్రెస్ కార్యకర్తల వెంటపడుతున్నారు కొంతమంది మట్టి వ్యాపారులు. శనివారం జింకలతండా గుట్ట నుంచి ఖమ్మానికి అక్రమంగా మట్టి తోలకాలు చేస్తున్న లారీల ఫొటోలు తీసిన కాంగ్రెస్ కార్యకర్తపై మట్టివ్యాపారి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన సీఐ మట్టి వ్యాపారిని మందలించారు. మట్టిని అక్రమంగా అమ్మకాలు చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

భరతనాట్యంలో చిన్నారుల ప్రతిభ



ఖమ్మంచర్చికాంపౌండ్ నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా శ్రీలక్ష్మీనర్సింహాస్వామి వారి దేవస్థానం యాదగిరిగుట్టలో జరుగుతున్న ధార్మిక సాహిత్య సంగీత ఉత్సవాల్లో ఖమ్మం అభినయరుద్ర నాట్యాలయం విద్యార్థులు ప్రతిభచాటారు. ఆలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినుల భరతనాట్యం ఆకట్టుకుంది. ఆలయ నిర్వాహకులు నాట్యగురువు కణతాల ఫణిల్ వారిని అభినందించి ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు.

ఝార్ఖండ్ గెలుపుతో కాంగ్రెస్ సంబురాలు


నేలకొండపల్లిలో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

నేలకొండపల్లి,నవంబరు23(ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ ఘన విజయంతో పాటుగా జార్ఖండ్‌లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావటంతో మండలవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు శనివారం సాయంత్రం సంబురాలు జరుపుకున్నాయి. బాణసంచా కాలుస్తూ, నృత్యాలు చేస్తూ, స్వీట్లు పంచుకున్నారు. వయనాడ్, జార్ఖండ్ ప్రజలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బచ్చలకూరి నాగరాజు, గుడిబోయిన వెంకటేశ్వర్లు, లిక్కి వీరబాబు, వడ్డె జగన్, మీసా నాగేశ్వరరావు, శాఖమూరి రమేష్, సోమనబోయిన సాయి, మెహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో కళావతిబాయి

తల్లాడ,నవంబరు23(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య సిబ్బంది విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతిబాయి హెచ్చరించారు. శనివారం తల్లాడలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ల్యాబ్, మందుల పంపిణీ గదులను ఆమె తనిఖీ చేశారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించిన సందర్భంగా ఆమె ఆదేశాల మేరకు జారీచేసిన షోకాజ్ నోటీసులకు సంబంధించి వైద్యాధికారి రత్నమనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడండి

తిరుమలాయపాలెం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను పిలుపునిచ్చారు. శనివారం తిరుమలాయపాలెంలోని సీపీఎం కార్యాలయంలో సమావేశంనిర్వహించారు. ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. 2022లో ఢిల్లీలో జరిగిన పోరాటం సందర్భంగా రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామని ఆనాడు కేంద్రప్రభుత్వం ప్రకటించి, వాటిని విస్మరించిందన్నారు. రైతులకు మద్దతు ధర, మూడు నల్లచట్టాలు, లేబర్‌కోడ్ వ్యతిరేకిస్తూ ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తిమ్మిడి హనుమంతరావు, మట్టె దుర్గాప్రసాద్, మందడి ఇజ్రాయేల్, ఉన్నం రాజశేఖర్, జి.రమేష్ మల్లయ్య పుల్లయ్య మధు, శ్రీనివాసరెడ్డి, రఘుబాబు, పాల్గొన్నారు.

అవగాహన ఉంటే నేరాలు చేసేందుకు భయపడతారు

సత్తుపల్లి,నవంబరు23 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన ఉంటే విద్యార్థులు నేరాలు చేయడానికి భయపడతారని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌బీఎస్ బాలుర ప్రభుత్వ కళాశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఫంక్షనింగ్ ఆఫ్ కోర్టులు అనే అంశాన్ని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే మంచి స్థాయికి చేరుకుంటారని, వ్యసనాలకు బానిస కాకుండా సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ ఎస్‌కే.ఆయేషాషరీన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ వడ్డే లావణ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో వైరా రాయల్స్-1కు ప్రథమ బహుమతి

వైరా,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): షేక్.షఫీ స్మారకార్థం విక్టరీబాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ మెమోరియల్6టూ6 టోర్నమెంట్‌లో వైరారాయల్స్-1 జట్టు ప్రథమ బహుమతి గెలుచుకుంది. మొత్తం పదిజట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ద్వితీయ బహుమతి వైరా రాయల్స్-2 దక్కించుకుంది. కాంగ్రెస్ నాయకులు సయ్యద్ అన్వర్, షేక్.రఫీ బహుమతులను అందజేశారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు షేక్.అంజాద్, టి.శ్రీకాంత్, రాము, శేషు, సాయి, సిద్ధూ, అద్దూ పాల్గొన్నారు. విజేతలను పలువురు అభినందించారు.

నేడు ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఎస్ఆర్ గార్డెన్‌లో(సీతారామ ఏచూరి ప్రాంగణం)లో నిర్వహించనున్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్య వక్తలుగా ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి వి కృష్ణయ్య, జేఏస్టీయూ మాజీ అధ్యక్షుడు ఐసీ ఘోష్ హాజరు కానున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి సుమారు 1000 మంది వరకు రానున్నారు. నాటిఉద్యమ స్ఫూర్తిని మననం చేసుకుంటూ, నేడు చేయాల్సిన కార్యాచరణపై జరిగే ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా కమిటి కోరింది.


పామాయిల్ సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటేశ్వరరావు

పామాయిల్ సాగుతో అధిక రాబడి

» ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు
» చింతగుర్తిలో ఏవోలు,ఏఈవోలకు శిక్షణ

రఘునాథపాలెం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): పామాయిలు సాగు ద్వారా రైతులకు అధిక రాబడి ఉంటుందని, సాగునీరు అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో పామాయిల్ సాగుకు రైతుల్ని ప్రోత్సహించాలని ఖమ్మం ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో పామాయిల్ వ్యవసాయ క్షేత్రాల్లో జిల్లాలోని ఏవోలు, ఏఈవోలకు ఒకరోజు శిక్షణ కార్యకమం నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో విదేశాల నుంచి వచ్చే పామాయిల్‌పై సుంకాలు పెంచటం ద్వారా తెలంగాణలో పామాయిల్ సాగు లాభసాటిగా మారిందన్నారు. ఎకరాకు రూ.80వేల వరకు నికర ఆదాయం వస్తోందని, రైతుల్ని అయిల్‌పామ్ దిశగా అవగాహన కల్పించాలని ఖమ్మం ఏడీఏ కొంగర సూచించారు. పలు అంశాలపై ఏవోలు,ఏఈవోలకు అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి నగేశ్ పామాయిల్ రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలను వివరించారు. రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ మిట్టపల్లి సతీష్, ఏవో భాస్కర్ పాల్గొన్నారు.

మాలల సింహగర్జన సభను జయప్రదం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు23 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న హైదరాబాదులో జరిగే మాలల సింహగర్జన బహిరంగసభను జయప్రదం చేయాలని ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మన్ గోపోజు రమేష్ అన్నారు. శనివారం నగరంలోని చర్చి కాంపౌండ్‌వద్దగల కమ్యూనిటీహాల్‌లో ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం జరిగింది. ప్రతీ గ్రామం నుంచి మాలలు కదంతొక్కి సభ జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి ఖమ్మంజిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, గులగట్టు యల్లయ్య, లింగాల రవికుమార్, మోటపోతుల బాబురావు, దామల్ల సత్యనారాయణ, ముదుసుజాకబ్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్

జిల్లా టూరిజం శాఖ అధికారి సుమన్ చక్రవర్తి


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న సుమన్‌చక్రవర్తి

తిరుమలాయపాలెం,నవంబరు23(ఆంధ్రజ్యోతి): చదువుద్వారానే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా టూరిజం శాఖ అధికారి సుమన్ చక్రవర్తి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సుబ్లేడు క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సీ గురుకుల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. తిరుమలాయపాలెంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాల, ఎస్సీబాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహాల్లోని భోజన తయారీవిధానాన్ని పరిశీలించారు. వారితో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎస్‌వో రమాకుమారి, బాలికల వసతి గృహ సంక్షేమాధికారి పూలన్‌దేవి పాల్గొన్నారు.

బంధాలపై సోషల్ మీడియా ప్రభావం

» సినీ నటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్


ప్రదీప్‌ను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాలోని బావాలు, ఆలోచనలు బంధాలపై ప్రభావం చూపుతున్నాయని సినీ నటుడు, వ్యక్తిత్వ వికాశ నిపుణుడు కేవీ ప్రదీప్ పేర్కొన్నాడు. ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో పిల్లలపై సోషల్ మీడియా ప్రభావాలు, తల్లితండ్రుల బాధ్యతలు అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సోషల్ మీడియా అనేది రెండు వైపులా పదునున్న కత్తి వంటిదన్నారు. నేటి ఆధునిక సమాజంలో అన్ని రకాల బావాలను సామాజిక మాధ్యమాలలోనే ఎక్కువ సమయం గడుపుతున్నామన్నారు. దీనినుంచి బైటపడేందుకే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. తల్లితండ్రులు ప్రతీరోజు పిల్లలతో సమయం కేటాయించి స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. మంచి, చెడులపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ప్రదీప్‌ను న్యూఇరా పాఠశాల చైర్మన్ ఐవి రమణరావు, డైరెక్టర్ పి.భూమేశ్వరరావు సన్మానించారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తల్లితండ్రులు, విద్యార్థులు సోషల్ మీడియాపై అవగాహన ఉండాలని, మంచిచెడులు తెలుసుకోవాలని వారు చెప్పారు.

హ్యాండ్ రైటింగ్‌లో 'స్మార్ట్‌కిడ్జ్' ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల విద్యార్థులు హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్, రంగోత్సవ్ పోటీల్లో పతకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. ముంబైకి చెందిన ఆర్గనైజేషన్ ఆఫ్ ఆర్ట్ కాంపీటీషన్ సంస్థ 2024లో నిర్వహించిన రంగోత్సవ్ వేడుకల్లోపాఠశాలకు చెందిన నిరూప, యశ్విని సాయి, మరో 20మంది విద్యార్థులు అవార్డులు పొందారని తెలిపారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 16 మంది ఎంపిక



ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 16మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం కళాశాలలో ఎంపిక చేశారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3 నుంచి 5 లక్షల వరకు అందుతుందని తెలిపారు.

గిరిజనులపై అక్రమ కేసులు అప్రజాస్వామికం

ఖమ్మంరూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): గిరిజనులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లలో వేయటం అప్రజాస్వామికమని సీపీఎం రూరల్ మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో లగచర్ల ఘటనకు వ్యతిరేకంగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. రేవంత్ రెడ్డి గిరిజన ఓట్లతో గెలిచి గిరిజనలను వంచనకు గురిచేయడం దారుణం అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నండ్రా ప్రసాద్ మాట్లాడుతు ఫార్మాసిటీ పేరుతో పచ్చని పంట పొలాలను లాక్కోవడం మంచి పద్ధతి కాదన్నారు. సీలింగ్ భూములలో పంటకు అనువుగాని భూములలో పార్మ కంపెనీలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.సంగయ్య, యామిని ఉపేందర్, రంజాన్, జక్కంపూడి కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నగర సంకీర్తన, మహాపడిపూజ

తల్లాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో శనివారం అయ్యప్ప మాలధారులు ఘనంగా నగర సంకీర్తన, మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. బొడ్డు మల్లయ్య 18వ పడి సందర్భంగా గురుస్వామి ఈలప్రోలు లాలయ్య, అర్చకులు మణికంఠస్వామి ఆధ్వర్యంలో నగర సంకీర్తన, మహాపడిపూజ నిర్వహించారు. అయ్యప్పస్వామివారిని పురవీధుల్లో పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాట నృత్యాలతో అయ్యప్ప భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో గురుస్వాములు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, రామకృష్ణ, భూక్యా బాలయ్య, మొక్కా బసవయ్య, పొన్నం శ్రీకాంత్, దూపాటి నరేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన ఉండాలి'



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస్

సత్తుపల్లి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నేరాలు చేయడానికి భయపడతారని 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌బీఎస్ బాలుర ప్రభుత్వ కళాశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఫంక్షనింగ్ ఆఫ్ కోర్టులు అనే అంశాన్ని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే మంచి స్థాయిక చేరుకుంటారని, చెడు వ్యసనాలకు బానిస కాకుండా సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని ఇతరులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివి ల్ జడ్జీ ఎస్‌కే.ఆయేషాషరీన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ వడ్డే లావణ్య, న్యాయవాదులు నల్లగట్ల విజయకుమార్, బోర్రా వెంకట్రావ్, బీ.సాంబశివరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి

» ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ



సమావేశంలో మాట్లాడుతున్న బుగ్గవీటి సరళ

వైరా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వారిపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మధు జూనియర్ కాలేజీలో ఐద్వా వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఎదుర్కొంటున్న హింసపై జరిగిన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో పసిపిల్లలపైన కూడా అత్యాచారాలు, హత్యల పరంపర కొనసాగుతుందని, చట్టాలున్నా రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ హక్కులు, రక్షణ కోసం మహిళలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ, మాజీ ఎంపీపీ బొంతు సమత, వైరా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మాడపాటి సుజాత, తోట కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సాగర్‌కాల్వలు

» ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
» పట్టించుకోని అధికారులు



దెందుకూరు వద్ద కంపచెట్లతో నిండి ఉన్న సాగర్ కాల్వ దృశ్యం

మధిర రూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో సాగర్ ఆయకట్టు పరిధిలోని ఎన్నెస్పీ కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది. అనేక ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో కాల్వలన్నీ కంపచెట్లు, తూటికాడతో నిండిపోయాయి. దీంతో కాల్వల్లో నీరు పారే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధిర బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 33వ కిలోమీటర్ నుంచి 55వ కిలోమీటర్ చిలుకూరు వరకు మధిర మండలంలో 22కిలోమీటర్ల పొడవునా సాగర్ కెనాల్ ఉంది. నిదానపురం, మధిర మేజర్ సాగర్ కాల్వల పరిధిలో మైనర్ కాల్వలు కూడా ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నపుడు మాత్రమే ప్రపంచ బ్యాంకు నిధులు వచ్చినపుడు మరమ్మతులు చేశారు. ఆతర్వాత సాగర్‌కాల్వల మరమ్మతులకు ప్రభుత్వాలు నిధులు కేటాయించలేదు.

మండలంలో నాగవరప్పాడు గ్రామం నుంచి చిలుకూరు వరకు ఏ మేజర్, మైనర్ కాల్వలను చూసినా కంపచెట్లు, తూటికాడతో నిండిపోయి అడవిని తలపిస్తున్నాయి. తూములు, షట్టర్లు ధ్వంసమయ్యాయి. సాగర్ కాల్వకట్టల రోడ్లన్నీ గుంతలు పడి ఆనవాలు లేకుండాపోయాయి. కాల్వలకు నీరు వదిలిన సమయంలో పంటపొలాలకు సక్రమంగా నీరందకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మధిర ప్రాంతం సాగర్ ఆయకట్టుకు చివరిగా ఉండటంతో అంతంతమాత్రంగా వచ్చే ఆనీళ్ల కాల్వల అధ్వానస్థితి కారణంగా చివరి భూములకు చేరడం లేదు. కాల్వలు పూడికతో నిండిపోయాయి.

పర్యవేక్షించే సిబ్బంది కరవు...

మధిర బ్రాంచ్ కెనాల్ పరిధిలో సాగర్ కాల్వలపై ఆరుగురు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, 12మంది లస్కర్లు నిత్యం పర్యవేక్షిస్తూ పంటపొలాలకు నీరందుతున్నాయో లేవోనని పర్యవేక్షించేవారు. ఇపుడు ఒకరిద్దరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు తప్పా, మిగతా సిబ్బంది ఎవరూ లేరు. గతంలో నీటి సంఘాల కమిటీలు ఉండి చైర్మన్లు, సభ్యులు కూడా నీటి విడుదల సమయంలో కాల్వలపై తిరుగుతూ పర్యవేక్షించేవారు. నాటి ప్రభుత్వం ఆ కమిటీలను రద్దు చేయడంతో నీటి సంఘాలు కూడా లేకుండాపోయాయి. దీంతో కాల్వల గురించి పట్టించుకొనే వారే లేక పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సాగర్‌కాల్వలకు మరమ్మతుల పట్ల నాడు ఉన్న ప్రభుత్వం నేడు ఉన్న ప్రభుత్వం రెండూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. సాగర్ కాల్వల ఆధునీకీకరణకు నిధులు మంజూరు చేసి చివరి భూములకు పుష్కలంగా సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగర్‌కాల్వల మరమ్మతులకు నిధులివ్వాలి

● సామినేని వెంకటేశ్వరరావు, రైతు, ఖమ్మంపాడు



మా గ్రామం సాగర్ ఆయకట్టులో చివర్లో ఉంది. సాగర్‌కాల్వలు అడవిని తలపిస్తున్నాయి. అనేక సంవత్సరాలుగా మరమ్మతులు లేవు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కాల్వలను పటిష్ఠంగా అభివృద్ధి చేయాలి. గతంలో నీటి సంఘాలు ఉండటం వల్ల చైర్మన్లు కూడా బాధ్యతతో పనిచేశారు. నేడు ఎవరూ పట్టించుకోవడం లేదు.

చివరి భూములకు నీరందించాలి

● ఈదర లక్ష్మణ్‌రావు, రైతు, ఆత్కూరు



మధిర మేజర్ పరిధిలోని మైనర్ కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. మాటూరు నుంచి ఆత్కూరు వైపు వచ్చే మైనర్ కాల్వ పూడిపోయింది. నిధులు మంజూరు చేసి కాల్వల్లో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి, చివరి భూములకు నీరందేలా చర్యలు తీసుకొని పంట పొలాలను కాపాడాలి.

మధిరలో ప్రజాపాలన విజయోత్సవ సభ వాయిదా

మధిర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరులోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో ఈనెల 24వతేదీ ఆదివారం నిర్వహించతలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవ సభ 25వతేదీకి వాయిదా పడినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వతేదీ సోమవారం సాయంత్రం 6గంటలకు విజయోత్సవ సభ కార్యక్రమం జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

నేడు కులమతాలకు అతీతంగా వన భోజనాలు

కారేపల్లి, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఆదివారం గ్రామస్తులు కులమాతాలకు అతీతంగా కార్తీమాసవన బోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సమీపంలోని ఊట్కూరు బస్టాండ్‌కు వద్దగల మామిడితోటలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'దివ్యాంగులకు సాయమందిద్దాం'

సత్తుపల్లిరూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులైన అభాగ్యులకు ప్రతిఒక్కరం సాయమందిద్దామని దివ్యాంగుల సేవాశ్రమం నిర్వాహకులు వలపర్ల అనిల్‌కుమార్ అన్నారు. మలైక పౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఎండీ.అబుజార్ 3వ పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలోని దివ్యాంగులకు దుప్పట్లు, చాపలు, పిల్లోలను అందించడంతో పాటు వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతిఒక్కరం దివ్యాంగుల కోసం చేయూతనందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా దాతలను దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు.

డేటా ఎంట్రీలో తప్పులు లేకుండా నమోదు చేయాలి

» ఆర్డీవో రాజేంద్రగౌడ్



కల్లూరులో సమగ్ర సర్వే డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, వనంబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్వేలో ఎన్యుమరేటర్లు ఇచ్చిన ఫారమ్‌లలో ఎలాంటి తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలని ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు. శనివారం కల్లూరు డివిజన్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రకియ పూర్తి కాగా, శనివారం నుంచి ఆయా మండల కేంద్రాల్లో డేటా ఎంట్రీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆయా డేటా ఎంట్రీ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం కల్లూరు మం డల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీపై అ ధికారులకు, ఎస్వోలకు ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కల్లూరు మండలంలో 23,600 కుటుంబాలు, తల్లాడలో 18,697 పెనుబల్లిలో 18,366, సత్తుపల్లిలో రూరల్ 15,782, వేం సూరులో 15,694, సత్తుపల్లి అర్బన్‌లో 11,352 కుటుంబాలు ఉన్నాయని వివరించారు. డివిజన్‌లో 1,03491 కుటుంబాలు ఉండగా సగటున ప్రతి రోజు 12,937 కుటుంబాలకు సంబంధించి సేకరించిన సమాచారం ప్రకారం డేటా ఎంట్రీ జరగాలని లక్ష్యం నిర్దేశించటం జరిగిందన్నారు. ప్రతి రోజు ఎన్యుమరేటర్ పరిధిలో 30 నుంచి 32 ఫారమ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు ఆయన వివరించారు. అందుకు డివిజన్ పరిధిలో డేటా ఎంట్రీకు గాను 431 మంది ఎన్యుమరేటర్లను నియమించటం జరుగుతుందన్నారు. ఈ డేటా ఎంట్రీ ప్రక్రియ సాజవుగా సాగేలా కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహిసిల్దార్లు, ఎంపిడిఓలు రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లు, ఎస్వోలు, డేటా ఎంట్రి ఆపరేటర్లు పాల్గొన్నారు.

సర్వే డేటా కేంద్రం పరిశీలన

పెనుబల్లి, నవంబరు23(ఆంధ్రజ్యోతి): కుల సర్వే డేటాను నమోదు చేస్తున్న కేంద్రాన్ని శనివారం కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా చేయాలని ఆపరేటర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, ఎంపీవో ఆర్.ఉపేంద్రయ్య, గిర్దావర్ ఎస్.విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్‌లో వైరా రాయల్స్-1కు ప్రథమ బహుమతి



కప్ అందుకుంటున్న విజేత జట్టు

వైరా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): షేక్.షఫీ స్మారకార్థం విక్టరీ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ మెమోరియల్ 6టూ6 టోర్నమెంట్‌లో వైరా రాయల్స్-1 జట్టు ప్రథమ బహుమతి గెల్చుకుంది. ద్వితీయ బహుమతి వైరా రాయల్స్-2 దక్కించుకుంది. కాంగ్రెస్ నాయకులు సయ్యద్ అన్వర్, షేక్.రఫీ బహుమతులను అందజేశారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు షేక్.అంజాద్, శ్రీకాంత్, రాము, శేషు, సాయి, సిద్ధూ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

» డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి



తల్లాడ పీహెచ్‌సీలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతి

తల్లాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి హెచ్చరించారు. శనివారం తల్లాడలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కాగా శుక్రవారం ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించిన సందర్భంగా ఆమె ఆదేశాల మేరకు జారీ చేసిన షోకాజ్ నోటీసులకు సంబంధించి డాక్టర్ రత్నమనోహర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సీతారాం, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.చంద్రనాయక్ పాల్గొన్నారు.

ఏన్కూరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎం.కళావతిబాయి సిబ్బందిని ఆదేశించారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఆరోగ్యశాఖ అధికారి సీతారాములు, సీడీఐవో డాక్టర్ చందునాయక్, పీహెచ్‌సీ వైద్యులు రాములు, మౌనిక, సీహెచ్‌వో శివరాజు ఫార్మసిస్టు దుర్గాప్రసాద్, ల్యాబ్ టెక్నిషియన్ ఉప్పెర్ల రమణ పాల్గొన్నారు.

వరి ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి

» సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు పుల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య

వైరా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆంక్షలు లేకుండా మద్దతు ధరకు పత్తి, వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. షేక్.జానీ అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ డివిజన్ సమావేశంలో మాట్లాడారు. పత్తి కొనుగోళ్లలో తేమ 20శాతం కంటే తక్కువగా ఉండాలనే ఆంక్షలతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. సీసీఐ కొనుగోలు చేసే పత్తికి ఆనస్తే ఎగుమతి ఛార్జీలు భరించాలని డిమాండ్ చేశారు. ఖాళీ గన్నీబస్తా ధర రూ.60చెల్లించాలని, మార్కెట్ ద్వారా రైతులకు తక్కుపట్టీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోళ్లకు కూడా ఆంక్షలు లేకుండా చూడాలని ఆమేరకు మైకు, గోడరాతలు, కరపత్రాల ద్వారా మార్కెట్ కమిటీ ప్రచారం చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు, నాయకులు పాశం అప్పారావు, గడ్డం లక్ష్మణ్, కె.దర్గయ్య, నున్నావత్ శ్రీనివాస్, కొల్లి నాగేశ్వరరావు, జాలమ్మ, నున్నావత్ లీల పాల్గొన్నారు.

'రైతుల మృతిని బీఆర్ఎస్ రాజకీయం చేస్తుంది'

చింతకాని, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చింతకాని మండలంలో రైతుల మృతిని అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న జనాదరణ చూడలేక మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. హరీష్‌రావు మండల పర్యటనకు వచ్చే ముందు వాస్తవాలను తెలుసుకుని వస్తే బాగుండేదని, మండల బీఆర్ఎస్ నాయకులు ఆయనను తప్పుదోవ పట్టించారన్నారు. ప్రొద్దుటూరు రైతు బోజడ్ల ప్రభాకర్, లచ్చగూడెం రైతు గూని ప్రసాద్ మృతిని కాంగ్రెస్ పార్టీ హత్యలుగా సంబోధించడం భావ్యం కాదన్నారు. పుల్లయ్య అరెస్ట్ రాజ్యాంగబద్ధంగా జరిగిందని, ఆ విషయంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధంలేదన్నారు. మృతి చెందిన రైతు బోజడ్ల ప్రసాద్ కుటుంబానికి భట్టి పరామర్శించి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చిన విషయం బీఆర్ఎస్ నాయకులు మరిచిపోయారని ప్రశ్నించారు. భట్టి సతీమణి మల్లు నందిని ప్రస్తావన తీసుకొచ్చి ఆమెను వివాదంలోకి లాగడం సమంజసంకాదన్నారు. అనంతరం జార్ఖండ్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, పెంట్యాల అప్పారావు, బొర్రా ప్రసాద్, సట్టు వెంకటేశ్వర్లు, వనం చిన్నప్ప, తూము కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

వైరా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 99వ జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీసత్యసాయి సేవసమితి ఆధ్వర్యంలో శనివారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శ్రీహరిహరసుత అయ్యప్ప క్షేత్ర సమీపంలోని శ్రీసత్యసాయి వేద పాఠశాలలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గోసేవ భజన, హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నిరుపేద మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ఐదుగురు గర్భిణులకు సీమంతం చేశారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ, సీహెచ్.వెంకటేశ్వరరావు, హనుమాయమ్మ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

వైరా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులందరికీ ఇందిర మ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి యా మా ల గోపాలరావు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆటో కార్మికుల ఏఐటీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులు కిరాయిలు లేక ఆర్థికంగా చితికిపోతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఆటో కార్మికులకు రూ.12వేలు చెల్లించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గారపాటి అశోక్, మిట్టపల్లి రాఘవరావు, ఇనపనూరి ముత్తయ్య, వెంకటేశ్వర్లు, తడికమళ్ల అంజయ్య, తేళ్లపుట్ట రాంబాబు, హన్మంతరెడ్డి, షేక్.షరీఫ్, వెంకన్న, తిరపయ్య, పుల్లయ్య, గోపి, ఉపేందర్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల కృషి అనిర్వచనీయం'



స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు

సత్తుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యార్థులను, సమాజాన్ని సరైన మార్గంలో ముందుకు తీసుకెళ్లడంలో ఉపాధ్యాయుల కృషి అనిర్వచనీయమైందని హెచ్ఎం సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పాలనా దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు అందరూ వారి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అది నెరవేర్చుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి బోధించగా విద్యార్థులు వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లాల్‌అహ్మద్, నరసింహా, వెంకటేష్, శేషకుమార్, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కమ్మ వనభోజన మహోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఏన్కూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కమ్మ మహాజనసంఘం ఆధ్వర్యంలో ఏన్కూరు మాదినేని బాబు మామిడితోటలో శనివారం వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు. ఆటపాటల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగులు సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,జిల్లానాయకుల తుళ్లూరి బ్రహ్మయ్య, గుత్తా వెంకటేశ్వరరావు, కమ్మసంఘం అధ్యక్షుడు తోట రాధాకృష్ణ, స్వర్ణ నరేంద్రకుమార్, మేడ ధర్మారావు, పొన్నం హరికృష్ణ, తాళ్లూరి అప్పారావు, వేములు రమేష్, గుర్రం రవి, రామకృష్ణ తదితరులున్నారు.



మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ధర్మపాలనకు నిదర్శనం మహారాష్ట్ర విజయం

» ఖమ్మం బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రామలింగేశ్వరరావు



సత్తుపల్లి, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ధర్మపాలనకు మహారాష్ట్రలో బీజేపీ విజయమే నిదర్శనమని ఆపార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. శనివారం మహారాష్ట్రలో బీజేపీ విజయం పట్లం హర్షం వ్యక్తం చేస్తూ మాట్లాడారు. మహారాష్ట్ర ప్రజలు మోదీ పరిపాలనపై నమ్మకం ఉంచి ఆయన పాలనలోనే ఈ దేశం అభివృద్ధి చెందుతుందని భావించి ఎన్డీఏ కూటమికి అఖండ విజయాన్ని అందించారన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన గ్యారంటీలను ప్రజలు నమ్మలేదని ఇప్పుడు స్పష్టమైందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇక ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

'26న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి'

సత్తుపల్లిరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర పాలకుల కార్పోరేట్ అనుకూల ఆర్థిక విధానాలతో దేశంలో ప్రజలు, రైతులు, కార్మికులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు, కార్మికులు, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీరెల్లి లాజర్, గంటా శ్రీనివాస్, జాజిరి శ్రీను, దండు ఆదినారాయణ, అమర్లపూడి శరత్, రామకృష్ణ, కొర్సా వెంకటేష్, సున్నం కృష్ణ, కుమారస్వామి, సన్మానరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

వైరా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలో ఇండియా కూటమి, వయనాడ్ ఎంపీ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ గెలుపుతో శనివారం వైరాలో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, రాంపూడి రోశయ్య, మిట్టపల్లి నాగి, బోళ్ల గంగారావు, పణితి సైదులు, బీడీకే.రత్నం, ధార్న రాజశేఖర్, మల్లు రామకృష్ణ, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, అడుసుమల్లి గణేష్, రామారావు, మధు, శ్రీను, అన్వర్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఆధ్వర్యంలో జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమిసాధించడంతో శనివారం సంబురాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, అనుమోలు కృష్ణారావు, కడియం శ్రీనివాసరావు, రాజీవ్‌గాంధీ, బాబురావు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వన సమారాధనలో విద్యార్థుల సందడి



వన సమారాధనలో సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు

కల్లూరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కల్లూరులోని పలు ప్రభుత్వ, ప్రయివైట్ పాఠశాలల విద్యార్థులు శనివారం వన సమరాధనలో సందడి చేశారు. ఈ వన సమరాధనలో ఆట, పాటలతో నృత్యాలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా ఉల్లాసంగా గడిపారు. కల్లూరులో పలు ప్రభుత్వ పాఠశాలతో పాటుగా బాలాజీ మోడల్ స్కూల్, విజ్ఞాన్ పాఠశాలల హెచ్ఎంలు వలసాల బాలజీ, యస్‌కే ఇస్మాయిల్‌తో పాటుగా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.